


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

(గత సంచిక తరువాయి)

హరిణిని తీసుకుని గుడికి వెళ్ళిన భారతి, రవి, శారదమ్మలు ఇంటికి రాగానే ఈ వార్త చెప్పాడు పార్వతీశం. అక్కయ్య వచ్చినప్పుడు తాను ఇంట్లో లేనందుకు నొచ్చుకుంది భారతి.

★★★★★

మర్నాడు పార్వతీశం తాను ఆరోగ్య కారణాల వలన ఎన్నికలలో నిల్చోలేననీ, ఆ కారణంగా తన కూతురు, ఊరిలో అందరికి ఇష్టురాలు, సేవా భావం కల రాజేశ్వరిని అభ్యర్థిగా ఆమోదించమని పార్టీ ఆఫీస్ వారిని అభ్యర్ధించాడు. వారు పైవారిని అడిగి ఆమోదించారు. మంచి రోజు చూసుకుని నామినేషన్ వేసింది రాజేశ్వరి పార్వతీశం, అన్న తమ్ములు, కృష్ణ, రవి, ప్రసాద్ లతో కలిసి వెళ్లి.

ఇక రాజేశ్వరి ప్రజాబలం కూడగట్టుకోవటంలో నిమగ్నురాలయింది. అందులో భాగంగానే “అందరిల్లు” లోని వారందరినీ పలకరించటానికి వచ్చింది. పదకొండు గంటలకి వస్తానన్న రాజేశ్వరి సరిగ్గా ఆ సమయానికే అందరింటి ముందు రిక్షా దిగింది లోపలకు వస్తూనే, ఈ మధ్యే అక్కడ పెట్టిన శయనమ్మగారి కంచు విగ్రహానికి నమస్కారం పెట్టి, తనతో తెచ్చిన పూల దండ వేసింది. కూడా వచ్చినతను ఆమె శయనమ్మగారి విగ్రహానికి దండ వేస్తుండగా ఫోటో తీశాడు. వరండాలో ఒక పక్క తోటపని చేస్తున్న వారందరినీ పేరు పేరునా పలకరించింది రాజేశ్వరి ఎన్నడూ లేనిది.

చెల్లెలు కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చింది. భారతి అక్కయ్యను చూసి సంబరంగా లేచి నిల్చుంది.

"రా అక్కయ్యా!” అంది

“భారతీ, ఈ రోజు నించే ప్రచారం మొదలు పెడుతున్నాను. బావ అమ్మా వాళ్ళింటికి వెళ్ళాడు వాళ్ళని పిలవటానికి. కాస్త ఇక్కడున్న వారందరినీ బయట కూర్చో పెట్టమని చెప్పవే, రెండు ముక్కలు మాట్లాడి వెళ్తాను.”

"అబ్బో, నాయకురాలి లక్షణాలు వచ్చేసాయ్ నీకు." భారతి కమలమ్మను పిలిచి అందరింట్లో ఉన్న పెద్దలందరినీ ఒక్కసారి ముందున్న ఖాళీ స్థలంలోకి రమ్మనమని కబురు చేసింది. ఈలోగా నాగరాజుతో కలిసి శారదమ్మ, హైమవతి, పార్వతీశంగారు కూడా వచ్చారు.

"నాన్నా ముందు మీరు మాట్లాడండి." అడిగింది రాజేశ్వరి.

పార్వతీశంగారు వరండాలో అందరి ముందు నిల్చోగానే ఆయన చెప్పేది వినటానికన్నట్లు నిశ్శబ్దమయ్యారు జనం.

రెండు చేతులు జోడించి "అందరికీ నమస్కారం. మీకో విన్నపం. నా పెద్ద కూతురు రాజు భారత దేశానికి జరగబోయే మొట్టమొదటి చట్టసభ ఎన్నికలలో మన జాతీయ కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తోంది. మీ అందరు, ఆమె యోగ్యురాలని తలిస్తే ఓటు వేసి గెలిపించండి" అన్నాడు పార్వతీశం. పెద్దలంతా చప్పట్లతో తమ ఆమోదం తెలిపారు.

తరువాత రాజేశ్వరి మాట్లాడింది. "నేను మీ పార్వతీశం గారి బిడ్డను. లోక్ సభ ఎన్నికలలో పాల్గొంటున్నాను. దయచేసి నన్ను మీ అందరూ కలిసి ఓటు వేసి గెలిపించాలి."

వెనుకనున్న పెద్ద రామయ్య లేచి అడిగాడు.

"రాజు తల్లీ, నువ్వేం చేసావో చెప్పు."

"నన్ను గెలిపించండి. లోక్ సభ సభ్యురాలిగా నేను చేయగలిగినంత చేస్తాను, మన ఊరి అభివృద్ధికి కృషి చేస్తాను." అందరూ చప్పట్లు కొట్టారు. ఇంకొకాయన లేచి చెప్పాడు.

"రాజేశ్వరమ్మా! నువ్వు అయ్యగారి కూతురివి, భారతమ్మ అక్కవీ అయినప్పుడే నీ గెలుపు ఖాయం అయిపోయింది. నువ్వొచ్చి అడగక పోయినా మా ఓటు నీకే వేసేవాళ్ళం." అందరూ చప్పట్లు కొట్టారు. మరోసారి అందరికీ నమస్కారం చేసి బయటకు నడిచింది రాజేశ్వరి. కానీ 'భారతమ్మ అక్క' అనే గుర్తింపు ఆమెకు ముల్లులాగా గుచ్చుకుంది.

అందరూ ఊహించినట్లుగానే మంచి ఆధిక్యతతో ఆ ఎన్నికలలో గెలిచింది రాజేశ్వరి.

## 37

ప్రజాసేవకు, ముఖ్యంగా స్త్రీ జనసేవకు భారతికి ఏ ఎన్నికలతోనూ పని లేదు. సమయమూ లేదు. ఒక్కోసారి ఆమె నిబద్ధత చూసి రవే ఆశ్చర్యపోయే వాడు. పార్వతీశం భారతి పని తీరు చూసి ముగ్ధుడైపోయే వాడు. ఆయనకు భారతిలో శయనమ్మగారే కనిపించేవారు. భారతి చేసే సంఘసేవ గురించి హైమవతి దగ్గర ఎప్పుడన్నా చెప్పబోతే ఆమె మొహం మారి పోయేది.

"భారతి దేముంది లెండి, ఏదో చేస్తోంది, కాదనను. కానీ మన రాజేశ్వరి వాళ్ళ హరిజన వాడ అంతా తారు రోడ్డు వేయిస్తోందట. వీధి పంపులు పెట్టిస్తోందట. ఇక వాడలో వాళ్ళు, వూళ్ళో వాళ్ళని అడిగి మంచినీళ్లు పోయించుకునే తిప్పలుండవట."

"అలాగా" అన్నాడు పార్వతీశం.

మరోసారి "మీరు రాలేదు కానీండి, రాజు వాళ్ళ వీధి చివర పార్కు ఏర్పాటు చేయిస్తోందిటండీ. అందరూ ఎంత గొప్పగా చెప్పుకుంటున్నారో" అంది.

"ఆ అలిమేలేమిటండీ, మరీ మనవళ్ళని కూడా చూసుకోలేదట. అమ్మాయి పనిమీద బయటకు వెళ్ళి వచ్చేసరికీ పిల్లలు సరిగ్గా తినట్లేదట."

పార్వతీశం నవ్వుతూనే ఖచ్చితంగా చెప్పాడు. "హైమా, నీ కూతురి గొప్పలు ఎన్నైనా చెప్పుకో గానీ, వాళ్ళ అత్తగారి మీద చాడీలు వంటి ఆడంగి ముచ్చట్లు నా దగ్గర తీసుకు రాకు." హైమవతి అక్కడనించి వెళ్ళిపోయింది.

ఇంకో సందర్భంలో, "రాజుకి సమయం చిక్కక వంటమనిషిని పెట్టుకుందిట. మనవాళ్లే. ఆమెకు చెప్పి చేయించటం కూడా అలిమేలుకి రాదట. ఎంతైనా ఆ జాతే అంత."

ఈ సారి గర్జించాడు పార్వతీశం "నోర్మూసుకో హైమవతి. ఇంకోసారి అలా మాట్లాడకు. అమ్మాయి కావాలని ఆ ఇంట కోడలిగా వెళ్ళింది. వింటే నొచ్చుకుంటుంది."

"అలా కోప్పడతారేమిటండీ. అమ్మాయి చెప్పకపోతే నాకెలా తెలుస్తాయి వాళ్ళ ఇంటి వివరాలు? నేను వెళ్ళినప్పుడల్లా మొత్తుకుంటుంది," అంది హైమవతి.

పార్వతీశంకి ఏమి చెప్పాలో తోచలేదు."అది అలా మాట్లాడితే నువ్వు తప్పని చెప్పాలి దానికి. లేదా అక్కడకి వెళ్ళటం మానెయ్యి." హైమవతి మానేసింది, రాజేశ్వరి ఇంటికి వెళ్ళటం కాదు, అక్కడి విషయాలు పార్వతీశంతో చెప్పటం.

ఆయనకు రాజేశ్వరి పార్లమెంట్ సభ్యురాలయినప్పటినించి రకరకాల తల నొప్పులు ఎక్కువయ్యాయి.

ఇరుగు పొరుగు వారు ఏదో పని చేయించమని అడగటాలు, ఉద్యోగాల కోసం సిఫార్సులు, బదిలీల కోసం దరఖాస్తులు ఇచ్చి వాటి విషయం కాస్త చూడమనటాలు. పార్వతీశం గారికి ఇవేవీ పడవు. పైగా పెద్ద కూతురు పార్లమెంట్ కు ఎంపికైన రెండేళ్లలోనే పెంకుటింటి స్థానంలో మేడ రావటంతో అందరూ రకరకాలుగా ఆమె గురించి వ్యాఖ్యానించటం పార్వతీశం గారికి పరువు తక్కువగా ఉంది. రాజేశ్వరికి అంత డబ్బు ఎక్కడిది? ఆయనకు తెలియదు హైమవతి తన మాట కాదని రాజేశ్వరికి ఆర్థిక సహాయం చేస్తోందని. ఆమె తనకు చెప్పకుండా అంతపని చెయ్యగలదని ఆయన కలలో కూడా ఊహించలేదు. పార్వతీశం మనసులో రకరకాల అనుమానాలు.

రాజేశ్వరి ఇంటికి హైమవతి వెళ్ళటం బాగా ఎక్కువయ్యింది. వచ్చేటప్పుడు రాజేశ్వరి ఇచ్చిందని రకరకాల పళ్ళు మిఠాయిలు పట్టుకురావటం సాగించింది. ఇన్నేళ్ళలో లేనిది శారదమ్మను కూడా కాస్త దూరం పెడుతుండటంతో ఆవిడ ఇదివరకులాగా వాళ్ళ ఇంటికి రావటం తగ్గింది. ఎవరి వంటలు వాళ్ళు చేసుకోవటం, ఎవరి ఇంట్లో వాళ్ళుండటం పెరిగింది.

రోజూ హైమవతి రాజేశ్వరి ఇంటికి వెళ్ళటం కోసం ఒక రిక్షా సిద్ధంగా ఉంటుంది గుమ్మం ముందు. కూతురికి ఇవ్వదలచినవన్నీ జీతగాళ్ల చేత అందులో పెట్టించుకుని బయల్దేరుతుంటుంది హైమవతి. ఆవిడలో దర్పం బాగా పెరుగుతోంది. మునుపటి సౌమ్యురాలైన హైమవతి, ఈవిడ ఒకరేనా అన్నంత మార్పు వస్తోంది మనిషిలో రాను రాను. పార్వతీశం పొలం పనులు చూసుకుని ఇంటికి వచ్చేవేళ్టికి కూడా ఒక్కోసారి ఇంట్లో ఉండట్లేదు హైమవతి. దాంతో ఆయన తిన్నగా ఇంటికి రాకుండా శారదమ్మ దగ్గరో, అందరింట్లోనో కూర్చుని హైమవతి ఇంటికి వచ్చాక ఇంట్లో అడుగుపెట్టటం అలవాటు చేసుకున్నాడు.

అందరింట్లో ఉంటె పార్వతీశంకి ఎక్కడలేని మనశ్శాంతి గుండెల్లో గూడు కట్టినట్లుంటుంది. ఒకే మాట మీద నడుస్తునట్లుండే చిన్న కూతురు, అల్లుళ్ళని చూస్తే ఆయనకు ఎంతో ముచ్చట. భారతి రెండవ సారి కడుపుతో ఉంది. అయినా ఆమె "అందరిల్లు" పనులు చూసుకోవటం మానలేదు. రవికి భార్య ఎంతో అపురూపం. కోర్టు నుంచి తిన్నగా ఇంటికి వచ్చేసి, స్నానం చేసి బట్టలు మార్చుకుని అందరింటికి వచ్చేస్తాడు. వాళ్ళు వాళ్ళింట్లో ఉండేకన్నా అందరింట్లోనే ఎక్కువ సమయం గడుపుతారంటే అతిశయోక్తి కాదు.

ఇక శారదమ్మకు భారతి ఇప్పుడు నెత్తి మీది దేవత. ఒకప్పుడు రాజేశ్వరి తన తోటి కోడలు కాలేదని ఎంతో బాధపడ్డ ఆమె, ఇప్పుడు కానందుకు ఎంతో సంతోషిస్తోంది. భారతికి వెన్నుదన్నుగా ఉంటూ అందరింట్లో తనకు చేతనైనంత సహాయ సహకారాలందిస్తోంది.

ఈ మధ్య కాలంలోనే కృష్ణకు ఏలూరు దగ్గర ఒక ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడి ఉద్యోగం రావటంతో వారు అక్కడ కాపురం పెట్టాల్సి వచ్చింది. తమ వాటాను అద్దెకి ఇద్దామని వారు నిర్ణయించుకోవడంతో ఆ వాటా అద్దె చెల్లించి దానిని భారతే తీసుకుంది. దేనికో భర్తకు కూడా చెప్పలేదు.

"చూస్తారుగా," అంది కవ్విస్తూ. రవి మురిపెంగా భార్యని చూసి ఊరుకున్నాడు. ఆమె మనసులో ఏదో ఉంటేనే కానీ అలాంటి పని చెయ్యదని అతనికి తెలుసు. మరో నెలరోజుల లోపు దాన్ని రవికి తనకోసం వచ్చే కక్షిదారులను కలుసుకుని మాట్లాడేందుకు ఆఫీసు గా మార్చేసింది భారతి. చక్కని అలంకరణతో ఆ వాటా స్వరూపమే మారి పోయింది.

## 38

"**అందరిల్లు**" తన కార్యక్రమాలను సమాజంలోని అన్నిసమస్యల వైపుకీ, ముఖ్యంగా స్త్రీ సమస్యల వైపుకి విస్తరిస్తోంది. అందులో ఆశ్రయం పొందిన వారికి జీవితంలో స్థిరపడటానికి ఉపాధి చూపిస్తోంది. ఆ ప్రయాణంలో ప్రపంచంలో ఎన్ని రకాల సమస్యలు ఉంటాయో అర్థమవుతోంది రవికి, భారతికి. మురారి, ముకుందం కూడా వాళ్ళతో కలిసి అడుగులేస్తున్నారు. ముకుందం తండ్రితో పొలానికి వెళ్ళి వచ్చాక వారికి సహాయ సహకారాలందిస్తుంటే, మురారి తన సమయాన్ని మొత్తం "అందరిల్లు" పనులకే వెచ్చిస్తున్నాడు.

ఆ రోజు మురారి ఆవేశంగా భారతి దగ్గర కొచ్చాడు. అతని మొహం కోపంతో ఎర్రబడి ఉంది.

"ఏమయ్యింది చిన్నన్నయ్యా?" భారతి అతనికి చల్లని మంచినీళ్లు ఇస్తూ అంది.

“నువ్విక్కడ కూర్చుని స్త్రీల కోసం కృషి చేస్తున్నా అనుకుంటుంటే చాలదు. అక్కడ ఊళ్ళో చాలా అన్యాయాలు జరుగుతున్నాయి.

“ఏమిటి చిన్నన్నయ్యా అవి?”

"భారతీ, నాకో విషయం అర్థం అయ్యింది. బాధితులు మన దగ్గరకి రావటం కాదు. ఎక్కువ శాతం మంది రారు కూడా. మనమే బాధితులు ఉన్న దగ్గరకి వెళ్ళాలి."

"వాళ్ళు బాధితులని మనకు తెలియద్దూ?"

"మనసున్న ప్రతివారికీ తెలుస్తుంది భారతీ. నీ దగ్గరకి వచ్చేది చాలా తక్కువ మంది. బయట బాధితులు మన ఊళ్ళోనే ఎందరో ఉన్నారు. ఒక్కసారి మనం మన పొలానికి వెళదాం రా."

భారతి భృకుటి ముడిపడింది. వెంటనే కదులుతూ, "మన పొలాల్లో ఏమన్నా సమస్యా?” అంది.

“అవును. కనపడని సమస్య. కలుపుతీతలకు కూలీలని తెస్తున్నది మన సుబ్బయ్య. వాళ్ళల్లో పనిచేసే వయసు లేని పసివాళ్లు ఉన్నారు, పనిచేసే వయసు అయిపోయిన ముసలివాళ్ళు ఉన్నారు,” ఉలిక్కిపడింది భారతి.

“అటువంటి వాళ్ళను ఎందుకు తీసుకున్నాడు సుబ్బయ్య?”

“అతని తప్పు లేదు. నువ్వే తెలుసుకుందువు గాని, పద. దీని పరిష్కారం మనం పూనుకుని అలోచించి చెయ్యాలి.” వెంటనే బయల్దేరింది భారతి.

మాటల్లోనే పొలాల దగ్గరకి చేరుకున్నారు వారు. అలుపు తెలియకుండా పదాలు పాడుతూ కలుపులు తీస్తున్నారు ఆడవారు.

“నోమీ నోమన్న లాలో నోమన్న లాలో

సందామామా సందామామా

పొద్దు కుంకక ముందె పొయి లో అగ్గెట్టాలా

పిల్లా పాపాల కింత పాలైనా పట్టాల”

ఓ పక్క కొంత మంది పొలానికి సన్న కాలువ తవ్వుతున్నారు. మరికొందరు ఆ మట్టి అవతలకి మోస్తున్నారు. కలుపు తీసే వారిలో పదేళ్లు కూడా లేని ఆడపిల్లలు ముగ్గురున్నారు. వాళ్ళు ఆ పనికి అలవాటు పడ్డట్టు లేరు. గట్టు మీదున్న సుబ్బయ్య గట్టిగా కేకలు పెడుతున్నాడు.

“ఎకరం నేలకు ఇంతమంది కూలీలని పెడితే పని కదలట్లేదు. మిట్ట మధ్యాహ్నా మవుతోంది. మళ్ళీ భోజనాలని దిగుతారు. అవతల నాకు మాటొస్తుంది. ఇదిగో పిల్లా, సుగుణా! కూటికి లేదన్నావని కూలికి పిలిచాను. ఏందీ ఆ నిదానం? నీతో పాటు ఇంకో ఇద్దర్ని తెస్తివి. ఇట్టయితే రేపణ్ణుంచీ పనిలోకి రామాకండి," ఆ పదేళ్ల పిల్ల అప్పుడే నడుమెత్తిందల్లా వీపు రుద్దుకుంటూ మళ్ళీ వంగింది.

అది చూసిన భారతిలోని అమ్మ మనసు కరిగి పోయింది.

"సుబ్బయ్యా," భారతి గొంతు విని ఎవరా అని ఇటు తిరిగాడు సుబ్బయ్య.

"అమ్మా, మీరా. ఏందీ ఇట్లా వచ్చారు?" అతనిలో ఎక్కడా తడబాటు లేదు. అంటే అతనికి తను తప్పు చేస్తున్నాననే తెలియదు.

"కొబ్బరి బోండాలు కొట్టండిరా అమ్మాయిగారికీ," ఓ కూలీకి పురమాయించాడు సుబ్బయ్య.

"భారతమ్మా, బాగున్నావా?" కూలీల్లో నుంచి ఓ ముసలాయన భారతిని చూసి మొహం నిండా నవ్వు నిండుతుండగా అడిగాడు.

"బాగున్నా, వెంకయ్య తాతా, నువ్వేంటి పనిలోకి వచ్చావు ఇంట్లో కూచోక?" కోప్పడింది భారతి.

"అంత అదృట్టం నాకు ఎక్కడమ్మా? నా కొడుకు మొన్న రేత్రి గోపాలరావు గారి పొలం నించి వస్తూ పురుగు ముట్టి పోయాడు. ముసలిదానికి, మిగిలినోళ్లకీ ఇంత కూడైతే పెట్టాలి కదా."

"అయ్యో, నీ కొడుకు….ఇద్దరు మనవలు కదా. ఏం చేస్తున్నారు? బాధగా అడిగింది భారతి.

"సుబ్బయ్య ధర్మమా అని మన చేలోనే, అదిగో ఆడ పని చేస్తున్నారమ్మా. వాళ్ళు కూడా సాయం చేస్తున్నారు కనుక నాలుగు వేళ్ళు లోపలకు పోతున్నాయి." నివ్వెర పోయింది భారతి. ఆమెకు మురారి చెప్పింది అర్ధమయ్యింది. తను వద్దంటే సుబ్బయ్య వాళ్లకి పని ఇవ్వడు, కానీ వాళ్ళ కుటుంబం గడిచేదెలా? వంచిన తల ఎత్తకుండా పనిచేస్తున్న ఆ పదేళ్ల పిల్ల కేసి వేలు చూపించి అడిగింది భారతి.

"ఆ అమ్మాయి?"

"తల్లి లేని పిల్లమ్మా. సవితి తల్లి తిండి కూడా పెట్టట్లేదు. నేనే పనిలోకి రమ్మన్నాను. పేరు సుగుణ," సుబ్బయ్య చెప్పాడు. భారతి కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"సుగుణా, ఇటు రా," సుగుణ భయం భయంగా వచ్చింది.

"పని సరిగ్గానే చేస్తున్నానమ్మా." ఆ అమ్మాయి తల నిమిరింది భారతి.

"చదువుకుంటావా?" భారతి అడిగింది. తల అడ్డంగా తిప్పింది సుగుణ.

"ఏం"?

"కూలీకి వస్తే డబ్బు లొస్తాయి. డబ్బులిస్తేనే పిన్ని కూడు పెడుతుంది. చదువుకుంటే డబ్బులు రావుగా! కూడెవరు పెడతారు?" భారతి ఆ జవాబుకి ఒక్క క్షణం బిత్తరపోయింది. అంతలోకే తేరుకుని, "నా దగ్గర ఉండిపో. నేను చదువు చెప్పిస్తా, అన్నం కూడా పెడతాగా."

"పిన్నికి డబ్బులో? ఇవ్వకపోతే వాతలు పెడుతుంది," అరచేతులు చూపిస్తూ అంది సుగుణ. ఆ రెండు చేతుల్లో వాతలు!

"అవీ నేనే ఇస్తాలే," నీళ్ళు నిండిన కళ్ళతో ఆ అరచేతులని తన చేతులతో పట్టుకుంటూ అంది భారతి.

"అయితే వస్తా."

"సుబ్బయ్యా, వాళ్ళ పిన్నిని తీసుకుని రేపు “అందరిల్లు” కి రండి. తాతా, నువ్వు కూడా నీ మనవళ్ళని తీసుకుని రా.” తల ఊపాడు వెంకయ్య.

మర్నాడు సుగుణ తల్లిని వెంటపెట్టుకుని తెచ్చాడు సుబ్బయ్య. నిలువెత్తు స్వార్థానికి అద్దం పట్టినట్లు ఉంది ఆమె. సుగుణని "అందరిల్లు"లో ఉంచటానికి బొత్తిగా ఇష్టపడలేదు. సంపాదించే పిల్లని చదివించటమేమి టంటుంది. చివరికి మురారి ఆమెను చిన్న పిల్ల చేత పని చేయించటం నేరమని, అలా చేయిస్తే కారాగారం పాలు అవ్వాల్సి ఉంటుందని, తన బావగారైన రవితో చెప్పి కేసు వేయిస్తానని బెదిరించేసరికి దిగి వచ్చింది. తను పిల్లని వదిలేసేందుకు కొంత డబ్బు అడిగింది. భారతి పోలీసు వాళ్ళ సమక్షంలో ఆ పిల్లని శాశ్వతంగా "అందరిల్లు" సంరక్షణలో వదలి వేస్తున్నట్లు వ్రాయించి ఆమె వేలిముద్ర వేయించుకుంది. విచిత్రమేమిటంటే సుగుణ తండ్రి కూడా ఆమె మాటలకే వంతపాడటం. ఎందుకన్నా మంచిదని అతని వేలిముద్ర కూడా వేయించుకుంది భారతి.

ఇక వెంకయ్య తాత సమస్యని రవి సలహాతో మరో రకంగా పరిష్కరించింది భారతి. వెంకయ్య, అతని భార్యకు వడ్డీ చెల్లించేలా అతని పేరు మీద కొంత డబ్బుని బ్యాంకులో పదేళ్ల పాటు కదల్చకుండా ఉండేలా జమ చేసింది. పదేళ్ల తరవాత దాన్ని మళ్ళీ పొడిగించే వీలుంటుంది. ఈ లోగా ఆ దంపతులు ఎవరు మరణించినా ఆ వడ్డీ డబ్బులో సగం అందరింటికీ, సగం రెండవ వారికీ చెల్లించబడుతుంది. రెండోవారు కూడా కాలం చేసినప్పుడు వడ్డీ పూర్తిగా ”అందరిల్లు” ఖాతాలోనే జమ అవుతుంది.

అతని మనవళ్లిద్దరినీ చదివిస్తే వారికి మంచి ఉద్యోగం వస్తుంది, ఇలా కూలి పనులు చేసుకు బతికే అగత్యముండదని ఆ దంపతులకు నచ్చచెప్పి పిల్లలను బడికి పంపే ఏర్పాట్లు చేసింది. వెంకయ్య కోడలు "అందరిల్లు"లోనే మంచంమీద ఉన్న ముసలివాళ్ళ మంచి చెడులు చూసే ఉద్యోగంలో చేరింది.

భారతికి వారి జీవితాలకు ఓ మార్గం చూపించినందుకు ఎంతో తృప్తి కలిగింది. ఆ ఆనందాన్ని అనుభవించే లోగా మరో సమస్య ఆమె దృష్టికి వచ్చింది. ఇలాంటివన్నీ సాధారణంగా మురారి కళ్లల్లోనే పడతాయి. రమణమ్మ గారి కోడలు రాజ్యం బావిలో దూకితే చుట్టూ పక్కల వాళ్ళు కలిసి బయటకి లాగారుట. ఆ పిల్ల నేను చచ్చిపోతానని ఒకటే ఏడుపుట..

మర్నాడు రమణమ్మ గారింటికి వెళ్ళింది భారతి. ఆ సమయానికే ఆమె కోడల్ని ఇంట్లోంచి వెళ్లగొడుతోంది.

"పోయి నీ చావు నువ్వు చావు. మళ్ళీ ఈ గుమ్మం తొక్కావా, నేనే పీక పిసికేస్తాను." వీధి గుమ్మం లోంచి లోపలకు వస్తున్న భారతిని చూసి చటుక్కున గొంతు మార్చి,

“రాజ్యం, భారతికి మంచినీళ్లు తేవే" అంది ప్రేమగా కోడలితో. ఆ గొంతు అలా ఎలా మార్చిందో భారతికి ఆశ్చర్యమనిపించింది.

"పిన్నిగారూ, మీ మాటలు వీధి చివరి వరకు వినిపిస్తున్నాయండీ. మా వారు సంగతేమిటో కనుక్కు రమ్మంటే ఇలా వచ్చాను." గతుక్కు మంది రమణమ్మ.

"ప్లీడరుగారు కనుక్కు రమ్మన్నారా?"

ఈ మధ్య రవి సొంతంగా ఆఫీసు తెరిచాడు పైన రెండో వాటాలో. చేపట్టిన కేసు లన్నిటిలో విజయం సాధిస్తుండటంతో ఊరంతా అతని పేరు మారు మ్రోగుతోంది.

రమణమ్మ గొంతు తగ్గించి రహస్యం చెప్పింది. "నా కోడలు రంకు నేర్చిందమ్మా. పక్కింటి సూరిబాబుకీ, దీనికీ సంబంధం ఉందని ఎంత మొత్తుకుంటున్నా మా వెర్రి వెంగళప్ప వినట్లేదు. అందుకే వెళ్ళ గొట్టేద్దామని చూస్తున్నాను.”

ఆమె ఆరోపణకు అసహ్యం వేసింది భారతికి.

“ మీ కోడల్ని ఇలా అనటానికి నోరెలా వచ్చింది మీకు?"

"పైగా అది గొడ్రాలు. పెళ్ళై ఐదేళ్లు అయ్యింది. ఇంత వరకు నెల తప్పలేదు. వాడికి మరో పెళ్ళి చేస్తే రేపీ పాటికి నాకు మనవడు పుడతాడు.”

లోపలనుంచి మంచినీళ్ల గ్లాసుతో వచ్చిన రాజ్యం ఏడుస్తూ చెప్పింది, "వదినగారూ, మీతో గనక చెప్తున్నాను. పెళ్ళైన ఐదేళ్లల్లో మేమిద్దరం కలిసి ఉన్నదే లేదు. మా నాన్న ఇస్తానన్న కట్నంలో వంద రూపాయలు తక్కువ పడ్డాయని అంటారు అత్తయ్య గారు. మా ఇద్దరినీ ఒక గదిలో పడుకోనివ్వరసలు, నాకు గర్భం ఎలా వస్తుంది? పక్కింటి సూరిబాబు గారికి నాకు సంబంధం ఉందని నానా మాటలు అంటుంటే భరించలేక బావిలోకి దూకాను," భోరున ఏడ్చింది రాజ్యం. భారతి కడుపు తరుక్కు పోయింది.

"ఏమిటి పిన్నిగారూ ఈ అన్యాయం? కట్నంలో వంద రూపాయలు తక్కువ పడ్డాయని కోడల్ని కొడుకుతో కాపురం చెయ్యనివ్వట్లేదా?"

"మీకేం భారతీ, పుట్టుక తోనే ధనవంతులు. వంద రూపాయలంటే సవిరిన్నర బంగార మొస్తుంది."

"నిజమే కావొచ్చు, కానీ బంగారం లాంటి మీ కోడలు పోతే తిరిగి వస్తుందా?" ప్రశించింది భారతి

"ఇది చస్తే ఇంకోత్తి," నిరసనగా అంది రవణమ్మ. అంతవరకు నోరెత్తని ఆమె కొడుకు సత్యం అన్నాడు.

"అమ్మా, ఇంతవరకు నువ్వు చేసిన ఘోరం తెలిసినా నేను నోరెత్తలేదు. ఇప్పుడు దాని బతుక్కి కూడా ఎసరు పెడుతున్నావు కనుక ప్లీడర్ గారి భార్య ముందు చెప్తున్నా. అక్కయ్యగారూ! పెళ్ళి పీటలమీద మా మావగారు ఇచ్చిన కట్నంలోంచి వంద రూపాయలని తీసేసి మా అమ్మ దాచటం నా కళ్ళారా చూసాను. కానీ బయటపడితే, పోయేది మా ఇంటి పరువేనని ఊరుకున్నాను. ఈవిడ ఆగడాలకు అంతు లేకుండా పోతోంది. రాజ్యాన్ని నానా అగచాట్లు పెట్టటమే కాక అనరాని మాటలు అంటోంది. ఇంక ఈవిడెట్లా పోయినా నాకు సంబంధం లేదు. నా భార్యతో నేను వేరు పోతాను." రమణమ్మ మొహం పాలిపోయింది.

"చూసారా పిన్నిగారు, మంచితన్నాన్ని చెడగొట్టుకోవడం అంటే ఇదే. ఇకపై రాజ్యాన్ని కష్టపెట్టింది తెలిస్తే, నన్నేమనుకున్నా సరే పోలీసులకు కబురు పంపుతాను. వాళ్ళను ఇక మీదైనా సుఖంగా బ్రతకనివ్వండి." రమణమ్మ ముఖం చూడటానికి కూడా మనసు రాక భారతి మొహం తిప్పుకుని వచ్చేసింది.

రాను రానూ రకరకాల స్త్రీ సమస్యలతో పరిచయం అయ్యింది భారతికి. ఎందరివో చెప్పుకోలేని సమస్యలు.

భార్య ఉండగానే రెండో పెళ్ళి చేసుకునే ప్రబుద్ధులు కొందరు! నైతికత లేని ఇటువంటి వారికోసమే భారత ప్రభుత్వం 1954లో హిందూ వివాహ చట్టం ప్రవేశ పెట్టింది. అది ఆ తరువాతి సంవత్సరం నుంచే అమలులోకి వచ్చింది. అయినా అందులోని లొసుగులను ఆధారం చేసుకుని ఎంతమంది భార్యలు ఉండగానే పునర్వివాహాలు చేసుకుంటున్నారో లెక్క లేదు. పైగా భారత స్త్రీకి భర్తే ప్రత్యక్ష దైవం కదా! మొగుడి రెండోపెళ్ళి విషయం నిజం కాదని భార్యలే బుకాయిస్తుంటారు. ఆర్థికంగా భర్త మీద ఆధారపడి ఉన్న అతివలు, అతన్ని ప్రాధేయపడి ఆ ఇంట్లోనే, అన్నం పెట్టి బట్ట ఇచ్చిందే ఎక్కువగా బ్రతుకుతుంటారు.

ఒకవేళ ఏ మగువైనా పుట్టింటికి వెళదామని ఆలోచించినా, ఆమెను రమ్మనేవారు ఉండేవారు కారు. ఆమెకు తిండిపెట్టలేక కాదు, కానీ తమ కుటుంబ ప్రతిష్ఠకు లోపమని. సర్దుకు పోలేనివారికి, భర్త పెట్టె శారీరక, మానసిక హింసలను తట్టుకోలేని వారికీ ప్రతివూళ్ళో ఉండే చెరువులు, పెరటి ఇంట్లో ఉండే బావులు స్వాగతం చెప్పటానికి సిద్ధంగా ఉండేవి! భార్య చనిపోయిన మగవాడు ఆరు నెలలు తిరగకుండా మళ్ళీ పెళ్ళి చేసుకునేవాడు. సమాజం అతన్నే సమర్థించేది.

"ఏం చేస్తాడు పాపం, మగవాడు! ఎన్నాళ్ళని ఇబ్బంది పడతాడు?" అని. ఇంకా విచిత్రమైన విషయం ఏమిటంటే, ఆ పిల్ల తల్లిదండ్రులు అల్లుడు పెట్టిన హింసల వలన కూతురు చనిపోయిందని తెలిసినా, మరో పిల్ల ఉంటె మళ్ళీ అతనికే

ఇచ్చి పెళ్ళి చెయ్యటానికి సిద్ధపడేవాళ్ళు. దానికీ సమర్ధన ఉంది. అక్క పిల్లలను చెల్లి అయితే బాగా చూసుకుంటుంది. అదే బయటపిల్ల అయితే సవతి తల్లిగా రాచి రంపాన పెడుతుంది అని.

ఇక రెండో పెళ్ళి చేసుకోకపోయినా వేశ్యల సాంగత్యం మరిగి పెళ్ళాం, పిల్లల మొహాలు వారాల తరబడి చూడని వారు కొందరు.

"నీ కిష్టమైతే పడి ఉండు, లేకపోతే పో," అంటాడా మొగుడు. పోతే పొట్ట ఎట్లా నిండుతుంది?

"మగవాడు ఎన్నైనా చేస్తాడు, మనమే సర్దుకు పోవాలి," అని ఇరుగమ్మలు, పొరుగమ్మలు సాయకారాలు దిద్దుతుంటారు. ఎంత క్షోభ అనుభవించినా ఆ ఇల్లాలు ఎవరి అండా లేక పోతే ఏమి చెయ్య గలదు? బయటకు వచ్చి బ్రతికే ఆర్ధిక బలం ఆవిడకి ఎక్కడిది?

ఇంకొంతమంది వుంటారు, వాళ్ళని ఏమని పిలవాలో కూడా తెలియదు. మానవ జన్మనెత్తిన చతుష్పాదులు. ఆ కామాంధులకు తాగితే చెల్లైనా, తల్లైనా తేడా తెలియదు. తాగి వచ్చి వావి వరుసలు తెలియని స్థితిలో చెల్లెలి పైటో, తల్లి పైటో పట్టుకుంటారు వాళ్ళు. వాడికి ఆ సమయంలో అందరూ ఆడవాళ్ళే.

ఇంకొంతమంది నీచులు కన్న కూతురినే డబ్బుల కోసం, సీసాడు సారాయికోసం పరాయి వాళ్ళ కప్పగించటానికి సిద్ధం. ఒక్కొక్కళ్ళ కథలను వింటున్న కొద్దీ రక్తం మరిగేది భారతికి. భారతి ఇంటింటికీ తిరిగి ఎంత కృషి చేసినా లాభం లేకపోయేది. ఇటువంటి పరిస్థితులలో చిక్కుకున్న ఆడవాళ్లు తామేదో తప్పుచేసినట్లు క్రుంగి పోయి, మరణించటానికైనా సిద్ధపడేవారే కానీ, బయటకు వచ్చి బ్రతుకుదామని చూసేవారు కారు.

భారతి ఎంత ఆలోచించినా దానికి రెండే కారణాలు కనిపించేవి. ఒకటి పుట్టింటి పరువు, రెండవది ఆర్ధిక అభద్రత! కానీ జీవితం ఈ రెండిటి కన్నా ముఖ్యమైనదని వాళ్లకి అర్ధమయ్యేది కాదు. ఇటువంటి దురాగతాలకు బలి అయిన ఆడవాళ్లను చూసిన భారతి చాలా రోజుల వరకు తేరుకోలేకపోయేది. అసహాయంగా మరణించిన స్త్రీల ఆక్రందనలు ఆమె చెవులలో ప్రతిధ్వనించినట్లయ్యి ఎన్నో రోజులు రాత్రిళ్ళు ఉలిక్కి పడి నిద్రలో లేచి కూర్చునేది. దీనికి పరిష్కారం ఏమిటి?

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS